ప్రజాశక్తి

శనివారం 11 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

అక్రమాలను సహించం

ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

- అవకాశాల వినియోగంలో గుంటూరు వాసుల ముందంజ
- నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు
- నిర్మాణ రంగానికి నిబంధనలు సరళతరం : మంత్రి నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

నిర్మాణ రంగాన్ని నిలబెట్టేందుకు ఉచిత ఇసుక ఇస్తున్నామని సిఎం చంద్రబాబు చెప్పారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న నరెడ్కో ప్రాపర్టీ షోను సిఎం ప్రారంభించారు. పలు స్టాల్స్‌ను ఆయన ప్రారంభించి జ్యోతి ప్రజల్వన చేశారు. 12వ ప్రాపర్టీ షోలో ప్రముఖ రియల్టర్లు, మెటీరియల్ సప్లైర్లు, బ్యాంకర్లు, ఆర్థిక సంస్థలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, లైజనింగ్ కన్సల్టెంట్లు, వాస్తు నిపుణులు, నిర్మాణ రంగ ప్రముఖులు హాజరైన సభలో సిఎం మాట్లాడుతూ ఎక్కడా ఇసుక అక్రమ రవాణాను అనుమతించమని దీనిపై ఇప్పటికే కలెక్టర్ల, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చాం. అధికారులు తప్పు చేసినా క్షమించను.' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. దేశంలో ఏ రంగంలో మంచి అవకాశాలు వచ్చినా వాటిని అందిపుచ్చుకుని ముందుకెళ్లడంలో గుంటూరు జిల్లా వాసులు ఎప్పుడూ ముందుంటారని 'ఐటీని అందిపుచ్చుకుని విదేశాలకు వెళ్లిన వారిలో గుంటూరు వాసులు ఎక్కువని చెప్పారు. బిల్డ్ ఏపీ నినాదంతో నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలన్న లక్ష్యంతో పలు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఐదేళ్ల విధ్వంస పాలనలో పడకేసిన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలన్న ధ్యేయంతో ఇసుకు ఉచితంగా ఇస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో ఎటు చూసినా విధ్వంసం... అంధకారమే కనబడిందన్నారు. '7 నెలల క్రితం వరకూ నిర్వీర్యమైన రాష్ట్రాన్ని చూశామని, అన్ని వ్యవస్థలు పతనమయ్యాయని, నిర్మాణ రంగమైతే గత ఐదేళ్ల అడ్రస్ లేకుండా పోయిందని అన్నారు. అందుకే ఎన్నికల్లో మమ్మల్ని ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో రాష్ట్రాభివద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చామన్నారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా ప్రధాని మోడీ రూ.2 లక్షల కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారని చెప్పారు.

రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందాలని, వారికి ఇబ్బంది లేకుండా

▶ 2లో

మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేఖ

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కార్యాలయం ముట్టడి
- ఖాళీల భర్తీకి, హెల్పర్ల ప్రమోషన్లకు పీడీ హామీ

ప్రజాశక్తి-గుంటూరు

పీడీకి సమస్యలు వివరిస్తున్న నాయకులు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. నాలుగు రోజులుగా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించి చర్చలు జరకపోవటంతో పీడీ కార్యాలయాన్ని ముట్టడించారు. తొలుత కలెక్టరేట్ నుండి ర్యాలీగా వెళ్లి పీడీ కార్యాలయం ఎదుట బైటాయించారు. సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.రేఖ మాట్లాడుతూ అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు పోస్టింగ్‌లు

▶ 2లో

జూదం జరగకుండా డ్రోన్‌ల ద్వారా నిఘా : పల్నాడు ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సంక్రాంతి నేపథ్యంలో జూదం, కోడిపందేలు, గుండాటలు తదితర నిషేధిత ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. జూదం నిర్వహణకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు నరసరావుపేటలోని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. పోలీసు ఉన్నత అధికారుల నుండి క్షేత్ర స్థాయి పోలీసు సిబ్బంది వరకు జిల్లా వ్యాప్తంగా పర్యటించి జూదం జరగకుండా ప్రత్యేక నిఘా, డ్రోన్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. గతంలో కోడిపందాలు, పేకాటలు నిర్వహించిన, ఆడిన వారికి కౌన్సెలింగ్, బైండోవర్ చేశామని తెలిపారు. యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో చిక్కుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కోడిపందాలు, ఇతర నిషేధిత ఆటలు జరుగుతున్నట్లు తెలిస్తే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్ లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పల్నాడు కలెక్టరేట్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ ఆవరణంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఆర్డీవో మురళి తెలుగువారి సంప్రదాయ వస్త్రధారణలో వేడుకల్లో పాల్గొన్నారు. రంగవల్లుల పోటీలు, హరిదాసు కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ర్పదర్శంచారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు కలెక్టరేట్ ప్రాంగణంలోని రోడ్లను రంగవల్లులతో అలంకరించారు. పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు.

సైనేడ్ హత్యల నిందితులు మరోసారి అరెస్టు

2లో

2 లో

పొన్నూరు ఎస్ఐ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న న్యాయవాదులు

పోలీసులు, లాయర్ల తోపులాట

పోలీసులు, లాయర్ల తోపులాట

ఉధృతమైన న్యాయవాదుల ఆందోళన

నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా నిరవధిక బహిష్కరణ

జిల్లా కోర్టులో పోలీసులతో ఘర్షణ

ఉద్యోగులను కూడా అనుమతించని వైనం

జిల్లా జడ్జి రాకతో ఉద్యోగులకు అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ : పొన్నూరులో న్యాయవాది బేతాళం ప్రకాశరావును పోలీసు అధికారులు కొట్టిన ఘటనలో కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళన శుక్రవారం తీవ్రరూపం దాల్చింది. విధులను బహిష్కరించిన న్యాయవాదులంతా బయటకు వచ్చి నిరసనలో పాల్గొన్నారు. రోడ్డుపై పొన్నూరు ఎస్ఐ దిష్టిబొమ్మను దహనం చేశారు. విధులకు హాజరవుతున్న మినిస్టీరియల్ ఉద్యోగులను కూడా అడ్డుకున్నారు. ప్రధాన గేట్లను మూసి వేసి ఎవ్వరినీ లోపలికి వెళ్లకుండా నిరోధించారు. ఈ దశలో విధి నిర్వహణలో ఉన్న ఒక కానిస్టేబుల్ ఆందోళనను వీడియో తీస్తుండగా ఆయన్ను న్యాయవాదులు అడ్డుకున్నారు. వీడియోను డిలీట్ చేయాలని వత్తిడి చేశారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. ఉన్నతాధికారులకు సమాచారం పంపడం తన బాధ్యతని కానిస్టేబుల్ చెప్పినా వీడియో డిలీట్ చేయాల్సిందేనని న్యాయవాదులు పట్టుబట్టారు. ఈ సమయంలో కోర్టు ప్రాంగణంలోకి వచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథిని చూసి న్యాయవాదులు వైదొలిగారు. న్యాయమూర్తి సూచన మేరకు మినిస్టిరియల్ ఉద్యోగులను విధులకు అనుమతించారు. న్యాయవాది ప్రకాశరావుపై దాడి కేసులో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి నిరవధికంగా కోర్టులను బహిష్కరిస్తున్నట్టు జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించక పోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సైనేడ్ హత్యల నిందితులు మరోసారి అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి : సైనైడ్ హత్యల కేసులో సంచలనం సృష్టించిన తల్లి, కూతుర్లను మరోసారి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎడ్ల లింగయ్య కాలనీకి చెందిన తల్లి, కూతుళ్ళు వెంకటేశ్వరి, రమణమ్మను గతంలో పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వారు బెయిల్‌పై ఉన్నారు. ఇద్దరూ కలిసి స్థానికుల వద్ద అప్పులు చేసి తిరిగి చెల్లించటం ఇష్టం లేక వారిని నమ్మించి కూల్ డ్రింక్, మద్యంలో సైనైడ్ కలిపి హతమార్చిన కేసుల్లో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ హత్యలు వెలుగులోకి రావడంతో ఇదే కాలనీకి చెందిన కరెవరపు మోషే అలియాస్ పీసు మృతిపై అనుమానం ఉందంటూ అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గతేడాది అక్టోబర్ నాలుగున తేదీన కొల్లిపర మండలం, హనుమాన్‌పాలెంలో మోషే శవాన్ని పోలీసులు వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ నివేదికలో అతనిది కూడా హత్యగా నిర్ధారణ కావడంతో తల్లీకూతుళ్లను మరలా అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు.

ఎన్నారై ఇంజినీరింగ్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - మేడికొండూరు

ఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోసంక్రాంతి సంబరాలు ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకు చేతికి వచ్చిన దినాల్లో ప్రజలందరూ సంక్రాంతి చేసుకునే వాళ్లని, పండుగ కోసం దేశ విదేశాల నుంచి తమ స్వస్థలాలకు

ప్రజలు వస్తున్నారని చెప్పారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్‌బాబు మాట్లాడుతూ భోగిమంటలు, గొబ్బెమ్మలు, పిండివంటలు, పచ్చని తోరణాలతో గృహాలు కలకల్లాడుతుంటాయని, మన సాంప్రదాయాన్ని మరువకూడదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల సెక్రటరీ ఎ.రాజేంద్రప్రసాద్, వై.ప్రిన్సిపాల్ శ్రీహరిరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, పెరిగిన పట్టణ అవసరాలకు అనుగుణంగా కార్మికులను నియమించాలని, కార్మికుల పట్ల వేధింపులను ఆపాలని తదితర డిమాండ్లతో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేటలో మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షలను శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి ప్రారంభించి మాట్లాడారు. ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయకపోతే మెరుపు సమ్మెకు సిద్ధంగా ఉండాలన్నారు. సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు మద్దతుగా మాట్లాడారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం రూ.6 వేలు హెల్త్ ఇన్సూరెన్స్‌ను జీతంతో కలిపి ఇచ్చారని, మిగిలిన హామీలు అమలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం రూ.24 వేలు వేతనాలు అమలు చేయాలన్నారు. రిటైర్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, రక్షణ పరికరాలు, ఇంజినీరింగ్ కార్మికులకు టూల్ కిట్లు ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. చిన్న అల్లాబక్షు, సోమశేఖర్, డి.నాగభూషణం, గౌస్‌బాషా, పి.రమేష్, నాగేశ్వరరావు, ఎస్.కోటేశ్వరరావు, ఖాసిం, సయ్యద్ కరీం, ఖాదర్, ఇంద్రయ్య, జి.సామ్రాజ్యం, రమణ, షైలు, కె.సమాధానం, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఒకరోజు దీక్షలో యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు చంద్రకళ మాట్లాడారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులకు జీవో 36 ప్రకారం జీతాలు పెంచాలని కోరారు. క్రాఫ్ట్ డ్రైవర్లకు ప్రతినెల జీతాలు చెల్లించాలని, జీతాలు పెంచాలని, పర్మినెంట్ కార్మికులకు జిపిఎఫ్ అకౌంట్లు, సరెండర్ లీవులు అమలు చేయాలని కోరారు. దీక్షకు సిఐటియు నాయకులు జె.రాజకుమార్, పి.మహేష్ మద్దతు తెలిపారు. బొమ్ము రాజశేఖర్, సిహెచ్ ప్రభు కుమార్, జి.దుర్గా, వి.మార్తమ్మ, జి.మరియమ్మ, ఎం.సత్యవతి, సునీత, డి.సామ్రాజ్యం, పి.నాగేంద్రం, ఎస్.జయమ్మ, జి.వెంకాయమ్మ, జి.శ్రీను పాల్గొన్నారు.

నరసరావుపేటలో మాట్లాడుతున్న డి. శివకుమారి

సత్తెనపల్లిలో దీక్షలు

అక్రమాలను సహించం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సూచించారని అన్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలతో వారి సమస్యలపై పలు దఫాలు చర్చించటంతో పాటు, దేశంలోని ఇతర రాష్ట్రాలలో ఉన్న బెస్ట్ విధానాలను స్టడీ చేయాలని అధికారులను పంపించామని, వీటిపై ప్రత్యేక కమిటీలు వేసి చర్చించి నేషనల్ బిల్డింగ్ కోడ్ సలహాలు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మోడల్ బిల్డింగ్ బైలాస్‌కు అనుగుణంగా నిర్మాణ రంగంలో అనుమతుల నిబంధనలు సరళతరం చేస్తూ శుక్రవారం పురపాలక శాఖ జీవో జారీ చేసిందని వివరించారు. దీనిలో ముఖ్యంగా గ్రూప్ డెవలప్‌మెంట్ స్కీంకు ఉన్న రెగ్యులైజేషన్ రూల్స్‌నే గ్రేటర్ కమ్యూనిటీలకు అమలు చేస్తామన్నారు. రైల్వే, రక్షణ శాఖల పరిధిలో నిర్మాణాలకు వారు నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ చేసిన దరఖాస్తులను సంబందిత శాఖల నుంచి ఎన్వోసీలతో సంబంధం లేకుండానే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. వాణిజ్య భవనాలతో పాటు 500 మీటర్లు పైన ఉన్న నివాస భవనాలకు సెల్లార్ నిర్మాణానికి అనుమతి ఇస్తామన్నారు. హైరైజ్ భవనాలు 55 -75 మీటర్ల ఎత్తు ఉన్న వాటికి 17 మీటర్లు, 70 -120 మీటర్లు ఎత్తు ఉన్నవాటికి 18 మీటర్లు, 120 మీటర్లు పైన వాటికి 20 మీటర్లు సెట్ బ్యాక్‌ను పరిమితం చేస్తూ ఉపసమనం కల్పించామని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో, ఇతర రాష్ట్రాల తరహా 10 అంతస్తుల దాటిన భవనాలకు ఎన్విరాల్మెంట్ డెక్‌ను ఇస్తామని, దీనిలో ఫ్లవర్ గార్డెనింగ్, గ్రీనరి, యోగా, స్పా, వీవింగ్ గ్యాలరీ వంటి వాటిని వినియోగించుకునేందుకు అనుమతి ఇస్తామని చెప్పారు. రహదారుల విస్తరణ సమయంలో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు జారీచేయక పోయినా కోల్పోయిన స్థలానికి సమానంగా వెంటనే నిర్మాణ చేసుకునే ప్రోవిజన్ ఇచ్చామన్నారు. 4000 చదరపు మీటర్ల గ్రూప్ డెవలప్‌మెంట్ లోని నిర్మాణాలకు 10 శాతం ఓపెన్ స్పేస్ స్థలంలోని 15 శాతం స్థలంలో స్విమ్మింగ్ పూల్ నిర్మించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. వ్యవసాయ జోన్‌లో పౌల్ట్రీ ఫారమ్‌లు ఏర్పాటు చేసుకునేలా నిబంధనలు మార్పు చేశామని తెలిపారు. టీడీఆర్ బాండ్ల ఫైనల్ చేసే కమిటీలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు వారిని తొలగించి మున్సిపల్ కమిషనర్‌ను, రీజినల్ టౌన్ ప్లానింగ్, స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులనే నియమించామని, యు ఎల్ బి లలో రెవెన్యూ ఆఫీసర్ చేర్చుతూ నిబంధనలు సులభతరం చేశామని తెలిపారు. లే అవుట్‌లలో నాన్ హైరేజ్ భవనాలకు వారి స్థలం ముందు రహదారికి ఇవ్వాల్సిన స్థలాన్ని వదిలిస్తే వారికి వెంటనే అనుమతులిచ్చేలా నిబంధనలు సడలించామన్నారు. గ్రూప్ డెవలెప్‌మెంట్ ఇళ్లకు కూడా వారి స్థలం వరకు రహదారి స్థలం వదిలేస్తే వారికి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. హైరైజ్ భవనాల్లో ఆర్డీపీని త్వరగా రూపొందించి పూర్తిచేసి అనుమతిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లే అవుట్‌ల ఏర్పాటుకు ఈరోజు నుంచి రహదారికి 9 మీటర్లు స్థలం వదిలితే సరిపోతుందన్నారు. దీనిని అందరూ కచ్చితంగా పాటించాలన్నారు. ఎమినిటీస్‌లో క్లబ్ హౌస్, కన్వెన్షన్ హాలు కాకుండా మిక్సిడ్ హౌస్ అని పెడితే టౌన్ ప్లానింగ్‌లో పెండింగ్ లేకుండా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. జాతీయ రహదారుల పక్కన సర్వీస్ రోడ్డు అభివృద్ధి చెంది జాతీయ రహదారుల అధికారులు ఎన్వోసీ తీసుకుంటే 12 మీటర్లు రహదారికి ఇవ్వాల్సిన అవసరం లేదని, జాతీయ రహదారుల అధికారులు కోరితే మాత్రం 12 మీటర్లు ఇవ్వాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. దీనితో పాటు ఐదు అంతస్తుల భవనాలకు సెల్ఫ్ డిక్లేరేషన్ తోనే భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేలా జీవోను రెండు రోజుల్లో ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, ఎమ్‌డి నసీర్ అహ్మద్, బి.రామాంజనేయులు, నగరపాలక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయరు సజీలా, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, నరెడ్కో నేషనల్ ప్రెసిడెంట్ జీవీ హరిబాబు, రాష్ట్ర అధ్యక్షులు గద్దె చక్రధర్, ప్రాపర్టీ షో చైర్మన్ గద్దె తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ పెరవలి నాగవంశీ, కార్యదర్శి శ్రీనాథ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సిఎంకు ఇన్నర్ రింగ్ రోడ్డు శ్రీ కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద మంత్రితోపాటు ఎమ్మెల్యేలు, అధికారులు, చైర్మన్లు, నాయకులు స్వాగతం పలికారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకపోవటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎప్పటికప్పుడు ఖాళీఅయిన పోస్టులను గుర్తించి ఇంటర్వ్యూలు నిర్వహించి భర్తీ చేస్తుంటే గుంటూరు జిల్లా అధికారులు మాత్రం జిల్లాలో నూట పది పోస్టులు ఖాళీ ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయట్లేదని ప్రశ్నించారు. జిల్లాలో 39 మంది వర్కర్స్, 66 మంది హెల్పర్ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ఆ సెంటర్లకు వచ్చే పిల్లలు ఏమి నేర్చుకోవాలని ప్రశ్నించారు. అంతేకాకుండా ఇన్‌ఛార్జిలతో సెంటర్లు నిర్వహించటం వల్ల అంగన్‌వాడీలపై తీవ్రమైన పనిభారం పడుతోందన్నారు. గుంటూరులో గత ఆరు నెలలుగా ఒక సెంటర్లో టీచర్, హెల్పర్ ఇద్దరూ లేకపోవటం వల్ల ఇన్‌ఛార్జిలతో నిర్వహిస్తున్నారన్నారు. ఐసిడిఎస్ అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి కానీ, అధికారులు కానీ చిత్తశుద్ధి లేనట్లు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు సక్రమంగా పనిచేయకపోతుంటే, వాటిని మార్చడానికి బదులు అంగన్‌వాడీలకు మెమోలు ఇచ్చి వేధించటం సరికాదన్నారు. కొంతమంది సూపర్వైజర్లు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ అంగన్వాడీలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని విమర్శించారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడుతూ అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సమ్మె సందర్భంగా గత జులైలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తర్వాత ఎన్నికల్లో గెలుపొందిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. వైసిపి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం కనుక తాము అమలు చేయలేమంటున్న ప్రభుత్వం మరి అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మర్ హాలిడేస్ అంగన్వాడి సెంటర్లో కూడా వర్తింపజేయాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి అధ్యక్షత వహించగా యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, నాయకులు బి.లక్ష్మణరావు, బాబూప్రసాద్, ఎస్.కె.హుస్సేన్‌వలి ప్రసంగించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మ, చిన్న వెంకాయ్యమ్మ, రాధా, హేమలత, విజయ్ కుమారి, ప్రేమలత, మరియరాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతాజి

ఖాళీలు భర్తీ చేస్తాం..పీడీ హామీ

జిల్లాలో అంగన్‌వాడీల ఖాళీలు భర్తీ చేస్తామని, హెల్పర్ల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ హామీ ఇచ్చారు. పీడీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీల వద్దకు వచ్చిన పీడీకి నాయకులు సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఖాళీల భర్తీ, హెల్పర్ల ప్రమోషన్లు జిల్లా స్థాయిలో చేయగలినా తాత్సారం జరుగుతోందన్నారు. సమస్యలపై పీడీ స్పందిస్తూ సంక్రాంతి పండుగ సెలవుల అనంతరం ఇంటర్వ్యూలో నిర్వహించి, హెల్పర్లు అందరికీ పోస్టింగులు ఇస్తామని, జిల్లాలో ఖాళీగా ఉన్న వర్కర్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులతో చర్చిస్తామన్నారు.

డ్రోన్‌తో మల్లెతోటకు పురుగుమందు

పరిశీలించిన రాష్ట్ర కమిషనర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండంలోని చినకాకానిలో రైతు బాపిరెడ్డి మల్లెతోటలో డ్రోన్ సాయంతో మందుల పిచికారీ కార్యాక్రమాన్ని శనివారం నిర్వహించారు. సరికొత్త టెక్నాలజీ డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ సామర్థ్యం ను రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఎస్. ఢిల్లీరావు వీక్షించారు. తర్వాత రైతు అనుభవం గురించి అడిగి తెలుసుకున్నారు. అభ్యుదయ రైతు శ్రీ బాపి రెడ్డి మాట్లాడుతూ తాను గత ఐదు సంవత్సరాల పైబడి డ్రోన్ నిర్వహణలో అనుభవం ఉన్నదని, తాను సొంతగా డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటా ఇతర రైతులకు అద్దె ప్రతిపదికన పురుగు మందులు, ఎరువుల పిచికారీకి బాగా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఒక ఎకరం డ్రోన్ ద్వారా పిచికారీకి తనకు అతి తక్కువ సమయం సుమారు పది నిముషాలు పడుతుంది అని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రోన్ శిక్షణ పొందిన రైతులకు డ్రోన్ పరికరాలను రాయితీ పై అందుబాటులో త్వరలో తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్, ఫారం మెకనైజేషన్ ఆర్ వివి. స్వర్ణ విజయ, సహాయ వ్యవసాయ సంచాలకులు, ఫారం మెకనైజేషన్ శ్రీ పోలప్ప, సహాయ వ్యవసాయ సంచాలకులు, మంగళగిరి శ్రీ గాయం శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి జెడ్. శైలజా రాణి, వి ఎ ఎ లు మరియు రైతులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీ కాలేజీలో ముగిసిన దీక్షారంబ్

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక అమ రావతి రోడ్డులోని హిందూ ఫార్మశీ కళా శాలలో నూత నంగా ప్రవేశం పొందిన బి.ఫార్మసీ, ఫార్మాడి విద్యార్థులకు ఆరు రోజులపాటు నిర్వహించిన దీక్షారంబ్-స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ ముగిసింది. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, దీక్షారంబ్ పోస్టర్ మొదటి రోజు ఆవిష్కరించారు. డిపార్టుమెంటు ఓరియంటేషన్ గురించి వివిధ డిపార్టుమెంట్‌ల విభాగాధిపతులు వివరించారు. ఆ తర్వాత జరిగిన కార్యక్రమాల్లో ఎన్‌సిసి ప్రాముఖ్యతను మేజర్ విజయ్ మోహిత్, ఎన్ఎస్ఎస్ గురించి ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వి. దివ్య తేజోమూర్తి వివరించారు. ఇన్‌టాక్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫార్మసీ నిపుణులు తమ వృత్తిలో పాటించాల్సిన విలువల గురించి వివరించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.ఎస్. విజయలక్ష్మి కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నివారణ, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమానికి యోన్‌టస్ లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్.బాలశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి అవకాశాల గురించి తెలియ చేశారు. డాక్టర్ ఆర్.గోవిందరాజన్ ఔషధ పరిశోధనల గురించి ప్రసంగించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి. సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, దీక్షారంబ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మశ్రీనివాస రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

అర్జీలు పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

ప్రజాశక్తి - తుళ్లూరు : గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదని సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ అన్నారు. శుక్రవారం స్థానిక సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు, రైతు కూలీలు పాల్గొని సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ డేలో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని అదనపు కమిషనర్ అర్జీదారులకు తెలిపారు. గ్రీవెన్స్‌లో సమస్యలను కొన్ని అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. అదనపు కమిషనర్ దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలను విభాగాల అధికారులు పరిష్కరించారు. మిగిలిన వాటిని కూడా సత్వరమే పరిష్కరించాలని అదనపు కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రాజధాని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం గ్రీవెన్స్ డేలో అమరావతిలో భూమి వ్యవహా రాలు45, ప్రణాళికా విభాగం కు 3, సామాజిక అభివృద్ధి విభాగం కు 2, డెవలప్మెంట్ ప్రమోషన్స్ కు 2, ల్యాండ్ స్కేప్ అండ్ పర్యావరణంకు 1, గ్రీవెన్స్ డేలో మొత్తం 53 ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె ఎస్ భాగ్యరేఖ, కె స్వర్ణమేరి, పి పద్మావతి, జి రవీందర్, ఎ జి చిన్నికష్ణ, బిసాయి శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో రౌడీషీటర్ అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

గంజాయి కేసులో రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసినట్టు త్రీ టౌన్ సిఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ఐతానగర్‌కు చెందిన సముద్రాల పవన్‌కుమార్ అలియాస్ లడ్డును కోర్టు ఇటీవల పోలీస్ కస్టడీకి ఇచ్చింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా గంజాయి కలిగి ఉన్నట్టు తేలడంతో అరెస్ట్ చేసి కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు.

చోరీ ప్రాంతంలో వేలిముద్రలు పరిశీలిస్తున్న క్లూస్ టీం

ఈపూరు పిఎసిఎస్‌లో చోరీ

రూ.3.20 లక్షలు అపహరణ

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్)లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నగదు చోరీ చేయడంతో పాటు సీసీ కెమెరాల డివిఆర్లను ఎత్తుకెళ్లారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనం పై అంతస్తులో వ్యవసాయ రుణాల కార్యకలాపాలు నిర్వహిస్తుండగా క్రింద గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎరువులు, పురుగుల మందుల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తారు. రోజు మాదిరిగానే కార్యకలాపాలు ముగిసిన అనంతరం సిబ్బంది తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోగా గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఎరువుల గోడౌన్ వైపు ఉన్న షట్టర్‌ను పైకి లేపి లోపలికి ప్రవేశించి ఎరువుల షాప్ లోని రూ.3.20 లక్షల నగదు చోరీ చేశారు. అలాగే పై అంతస్తులోకి వెళ్లేందుకు మెట్ల వద్ద ఉన్న గేటు తాళాన్ని పగలగొట్టి సొసైటీ కార్యదర్శి గదిలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి చోరి ఆనవాళ్లను గుర్తించకుండా ఉండేందుకు దొంగలు డివిఆర్‌లను ఎత్తుకెళ్లారు. కార్యదర్శి గది పక్కనే ఉన్న లాకర్ తలుపులు తీయడానికి ప్రయత్నించి విఫలయత్నం చెందారని సిబ్బంది తెలిపారు. ఉదయాన్నే విధులు నిర్వహించేందుకు వచ్చిన సిబ్బందికి షాపులో వస్తువులన్నీ చిందర వందరగా పడటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ ఉమామహేశ్వరరావు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. గుంటూరు నుండి క్లూస్ టీం బృందం చోరీ జరిగిన ప్రదేశంలో వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆటంకాలు పెట్టడం సరికాదని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు అన్నారు. స్థానిక రజకచెరువు వద్ద అంబేద్కర్ విగ్రహ నిర్మాణ ఏర్పాట్లను శుక్రవారం బిఎస్పి తెనాలి నియోజకవర్గ కన్వీనర్ కారుమంచి సునీల్ సందీప్ తో కలిసి పరిశీలించారు. 1996లో శ్రీకారం చుట్టిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లను ప్రభుత్వ అధికారులు ఆటంకపరచడం సరికాదని అన్నారు. ఈ ఘటనపై బిఎస్పి నాయకులు విగ్రహ కమిటీకి పూర్తిఅండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ సునీల్ సందీప్ దళిత నాయకులు బొనిగల ప్రదీన్, దేవరపల్లి నాగరాజు, పిల్లి తిమోతి, పొందుగల ఆనంద్, బి.ఎస్.ఎ యూత్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

Chintalacheruvu Rajyalakshmi is my original name. My Aadhar card bearing No.574680280643 shows my name is **Chintalacheruvu Rajyalakshmi**. Whereas my Indian Passport bearing No.L4714653 shows my name is **Chinthalacheruvu Rajyalakshmi** due to mistake.

I applied for name change as **CHINTALACHERUVU RAJYALAKSHMI** in the said my Indian Passport.After change my name I will continue with my name as **CHINTALACHERUVU RAJYA LAKSHMI.**

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD

O.S. No. 3504 of 2023

Between:
M/S JASPER INDUSTRIES PVT LTD
... Plaintiff
AND
SHAIK NABHI
... Defendant

To,
Mr. Shaik Nabhi, D.No.4-14-226/A/14 Koritepadu,Guntur-522 007.A.P.

Please take notice that the Plaintiff herein filed the suit O.S. No. 3504 of 2023against you in the Hon'ble V Junior Civil Judge Court, City Civil Courts at Hyderabad seeking recovery of Rs. 6,17,551/- along with interest and costs due towards repairs, servicing and parking chargesfor your vehicleTATA ACE 1 TON with the chassis number MAT483139DYF21853 and bearing registration number TS12UB2327. This O.S is posted on 24-01-2025 for your appearance

Kindly appear before this Hon'ble Court on **24-01-2025**, at **10:30** AM, either in person or through an advocate, failing which the matter shall proceed ex-parte against you.

//BY ORDER//

V.R.N.Prashanth
Advocate
Indus Law Firm
6-3-522 535, VillaNo.7, Pavani Villas, DwarakapuriColony, Panjagutta, Hyderbad-500082
Cell No.: 8179625001,

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, యర్రబాలెం గ్రామము, డోరు నెం: 9-88 నెంబరు నివాసి చిమటా అచ్చయ్య గారి కుమారుడు చిమటా బసవయ్య, ఎలియాస్ చిన బసవయ్య గారి సంజాయిషీ మేరకు ఈ బహిరంగ ప్రకటన జారీ చేయడమైనది. నా క్లయింటుకు సర్వ స్వాధీన సంపూర్ణ హక్కు భుక్తములలో యున్న నవులూరు శివారు యర్రబాలెం గ్రామ సర్వే నెం: 531-బి, లో గల య.1-25 సెంట్లు భూమిని ది.28-2-2015వ తేదీన ల్యాండ్ పూలింగ్‌కు Dy. Collector, CRDA, Yerrabalem వారికి యివ్వగా, వారు నా క్లయింటుకు సి.ఆర్.డి.ఏ డెవలప్‌మెంటు కోసం ఫారం 9-14. మరియు నాకు ఒక సంవత్సరము కవులు యిచ్చియున్నారు. నా క్లయింటు వదిన గారైన నాగేశ్వరమ్మకు జీవనోపాధి కోసం నేనూ, నా తండ్రిగారున్నూ కలసి ది.31-05-1976 దఖలు దస్తావేజు నెం: 1492/1976 ప్రకారం ఆమె సదరు భూమిని అమ్ముకొనే హక్కు లేదు. కేవలం సదరు భూమిపై వచ్చే ఫలసాయం మాత్రమే ఆమె అనుభవించ వలసి యున్నది. కాని నాకు కూడా తెలియ కుండా నాకు కేటాయించ వలసిన ప్లాట్లు (1) ప్లాట్ కోడ్ నెం 28/821-4835-3- సి2, ప్లాటు నెం:, టౌన్ షిప్ 28 విస్తీర్ణము చ.గ.లు. 500 (పట్టణం 28, ప్లాటు ఉపవర్గము సి-2, బ్లాకు 4825, కాలని 821, (1) ప్లాట్ కోడ్ నెం- 28/821 -4835-3- సి2, ప్లాటు నెం:, టౌన్ షిప్ 28 విస్తీర్ణము చ.గ.లు. 500 (పట్టణం 28, ప్లాటు ఉపవర్గము సి-2, బ్లాకు 4825, కాలని 821, ప్లాటు నెం.3). ప్లాటునెం. 3). ఐపియస్ విలేజ్, యర్రబాలెం, (2) ప్లాట్ కోడ్ నెం-25-769-4578-31-34, ప్లాటు నెం: 31, టౌన్ షిప్ 25 విస్తీర్ణము చ.గ.లు. 540. (పట్టణం 25, ప్లాటు ఉపవర్గము సి-4, బ్లాకు: 4578, కాలని 769, ప్లాటునెం.31) (3) ప్లాట్ కోడ్ నెం-28-821-4835-4-సి10, ప్లాటు నెం:4, టౌన్ షిప్ 28 విస్తీర్ణము .గ.లు. 750. (పట్టణం 28, ప్లాటు ఉపవర్గము సి-10, బ్లాకు: 48345, కాలని 821. ప్లాట్ నెం:4 లును నాగేశ్వరమ్మ పేరు మీదగా ప్లాట్లును ఎలాట్ మెంట్ చేసి యున్నారని నాకు తెలిసినది. చిమటా నాగేశ్వరమ్మ పేరుమీదగా CRDA వారు ఎలాటట్ చేసిన ప్లాట్లు ఆమెకు చెల్లనేరవని, ఆమె వేరే వారికి అమ్ముకునే హక్కు లేదని నేను CRDA Chairman గారికి Yerrabalem ల్యాండ్ పూలింగ్ వారికి తెలియ పరచి యున్నాను. కావున పైన తెలియచేసిన ప్లాట్లు వివాదంలో యున్నందున చిమటా నాగేశ్వరమ్మకు అమ్ముకునే హక్కులేనందున, అట్టి ప్లాట్లు కొన్నవారిపై మేము సివిల్, క్రిమినల్ చర్యలకు తీసుకోగలమని దానికి వారు బాధ్యత వహించ వలసి యుండునని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

ది.:10-1-2025

దొడ్డక బ్రహ్మయ్య,
న్యాయవాది,
పెద్దకొనేరు వీధి, మంగళగిరి
సెల్ నెం.9849379667

ప్రకటన

నా క్లయింటు అయిన మాధవి చిట్టిప్రోలు గారి నుండి సంజాయిషీ పొంది ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి నా క్లయింటు ఉదిగ రూపవతి గారి తరపున జనరల్ పవర్ ఆటార్నీ ఏజంట్టైన సోమయాజుల రాజేశ్వరరావు గారి వలన క్రయమును పొంది శ్రీ కంచికచర్ల సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము, ద.నెం.9767/2024రుగా రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా సంక్రమించిన ఆస్థిని వారి కుటుంబ అవసరముల నిమిత్తము విక్రయ ఏర్పాటుచేసియున్నారు. సదరు విషయము తెలుసుకున్న సదరు దలారులు నా క్లయింటుతో సంబంధము లేకుండా నా క్లయింటు ఆస్తిని బేరసారాలు ఆడుతున్నారని తెలియ వచ్చినది. సదరు దలారులను నమ్మి ఏవరైన మోసయోయి అడ్వాన్సు వగైరాలు ఏమైన జరిపిన యెడల నా క్లయింటుకు ఎటువంటి సంబంధములేదు. సదరు ఆస్థిని ఏవరైన కొనుగోలు చేయదలచిన యెడల నా ద్వారా నా క్లయింటును సంప్రదించి కొనుగోలు ఖరారుచేసుకోగలరు. నా క్లయింటు అనుమతి లేకుండా జరుగు బేరసారాలు ఏమైన నా క్లయింటు దృష్టికి వచ్చిన యెడల ఆమె తీసుకొనే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు. షెడ్యూలు:యన్.టి.ఆర్. జిల్లా. కంచికచర్ల సబ్.డి.యిలాకా,కంచికచర్ల మండలం, గనిఆత్కూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గనిఆత్కూరు గ్రామం తాలూకు సర్వే నెం.143/5ఏ రు దాఖలా చ.గ. 131లు స్థిరాస్థి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు:
తూర్పు: వెంపరాల ఆంజనేయులు గారి ఆస్థి హద్దు. అ.65.5లు
దక్షిణం:ఉప్పెర్ల రాఘవమ్మ గారి ఆస్తి హద్దు. అ.18.0లు
పడమర:జామి శివ గారి ఆస్థి హద్దు. అ.65.5లు
ఉత్తరం:ఆర్.అండ్.బి. రోడ్డు హద్దు. అ.18.0ల
యీ నాలుగు హద్దుల మద్య చ.గ. 131లు లేక చ.మీ.109.533ర్లు నివేశన స్థలము మాత్రం.

ఇట్లు,
ఏనుగుల సురేష్
అడ్వకేట్, మంగళగిరి,
సెల్ నెం. 9866275515

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రజాశక్తి-గుంటూరు

సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వీసులపై ఏ ఒక్కరూ అలసత్వం వహించకూడదని చెప్పారు. ప్రభుత్వం తరపున మంచిపాలన అందించే క్రమంలో ప్రతి ఉద్యోగి అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాలపై వ్యతిరేకంగా ఏ ప్రభుత్వ ఉద్యోగి వ్యవహరించకూడదని, సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకూడదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో ఎంపిడిఒ బండి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది పిల్లలకు నేడు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు : కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ గుంటూరు వారి ఆధ్వర్యంలో ఉన్నత విద్య అభ్యశిస్తూ చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 115 మంది గుంటూరు జిల్లా పోలీసు సిబ్బంది వారి పిల్లలకు శనివారం రూ.5 లక్షల 95వేల ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం గుంటూరులోని పోలీస్ కళ్యాణ మండపంలో శనివారం సాయంత్రం 5గంటలకు ప్రారంభమౌతుందని, తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు, జిల్లా ఎస్పీ యస్.సతీష్ కుమార్ హాజరై అందచేస్తారన్నారు.

నేడు స్వప్న వేణువు గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక నందుల పేట కవిరాజా పార్కు సీనియర్ సిటిజన్స్ భవన్లో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రముఖ రచయిత కొలకలూరి దేవికారాణి రచించిన స్వప్న వేణువు గ్రంథావిష్కరణ సభ జరుగుతుందని నిర్వాహకులు విద్యాధర ప్రభాస శుక్రవారం తెలిపారు. సభలో ముఖ్యఅతిథిగా దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజర్లమూడి కృపాచారి పాల్గొంటారని తెలిపారు. పలువురు రచయితలు, సాహితీ ప్రియులు పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

హామీల అమలు కోసం మున్సిపల్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

దీక్షలను ఉద్దేసించి మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్ వద్ద శుక్రవారం రిలే దీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 16 రోజులపాటు సమ్మె చేయగా ప్రభుత్వం పలు హామీలను ఇచ్చిందని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలుకు, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపు, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం, ప్రమాదవశాత్తు మరణిస్తే పరిహారాన్ని రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంపుతోపాటు ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్‌గా వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే ఆ హామీలు ఇంకా అమలు కాలేదని, వాటిని సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని, వారికి రావాల్సిన పరిహారం వెంటనే ఇవ్వాలని యూనిఫాం, సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఎన్ఎంఆర్, కోవిడ్ సమయంలో పనిచేసిన కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి ప్రజల కోసం పారిశుధ్య విధుల్లో కార్మికులు పని చేస్తున్నారని, ఈ సేవలను ప్రభుత్వాలు గుర్తించని కారణంగా పండగ రోజుల్లోనూ ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. దీక్షల్లో కార్మికులు మొగిలి ప్రతాప్, బత్తుల రామారావు, గుంటి నాగేశ్వరరావు, దేవరకొండ మార్తమ్మ, కంపా చిన్న వీరమ్మ, కుంభ కృష్ణవేణి, దేవళ్ల వెంకటేశ్వర్లు, గద్దె శ్రీను, కోపరి రమేష్, విజయ్, వేముల శ్రీనివాసరావు, కొక్కెర శ్రీనివాసరావు, కంపా సురేష్, రామయ్య, రాగిరి శ్రీను, అనంతలక్ష్మి, కొమర గురవయ్య, పరస మేరీ, ప్రసన్న, గ్లోరీ, అన్నపూర్ణ దేవి, మేరమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డి.శివకుమారి

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఆశ వర్కర్ల సమావేశం స్థానిక మార్కెట్ యార్డులో జరిగింది. సమావేశానికి ఎం.శ్వేత అధ్యక్షత వహించగా యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా ఆశా వర్కర్లతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, క్యాజువల్ లీవులు, పండగ సెలవులు, మెడికల్ లీవులను అమలు చేయాలని కోరారు. ఏడాదికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాస రావు, కోమలత, కోటేశ్వరి, రమణ, అలేఖ్య, జ్యోతి, శారద, వెంకటరమణ, మల్లేశ్వరి, సుజాత, రత్నకుమారి, శైలజ, జి.లక్ష్మి, అనంతలక్ష్మి, మరియకుమారి, బిక్ష భాయ్ పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

క్రీడలతో పాటు క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మండలంలోని పమిడిపాడులో పూనాటి హనుమంతురావు, కె.హనుమంతురావు జ్ఞాపకార్థం పల్నాడు జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని పునాదిగా చేసుకుని విజయానికి బాటలు వేసుకోవాలని చెప్పారు. అందరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. క్రీడల్లోనూ రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగొచ్చని చెప్పారు. టిడిపి నరసరావుపేట మండల మాజీ అధ్యక్షులు పూనాటి శ్రీనివాసరావు, ఇతర నాయకులు, పోటీల నిర్వహకులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాలకు ఎన్ఇసి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రాష్ట్ర రాజధాని అమరావతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవాల పెరేడ్‌లో రెడ్‌క్రాస్ బృందానికి పల్నాడు జిల్లా తరపున నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కె.హర్షవర్ధన్, కె.వెంకట ప్రవీణ్‌రాజు, కె.రాజేష్ ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గణతంత్ర దినోత్సవాల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి,సెక్రటరీ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరి ఈ ఏడాది కూడా రాష్ట్ర స్థాయి వేడుకలలో తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, ఎన్.సి.సి అధికారి మేడికొండ రాజేష్ బాబు, విభాగధిపతులు డాక్టర్ ఎస్.వి.ఎన్ శ్రీనివాసశర్మ, డాక్టర్ చక్రవర్తి అభినందించారు.

కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ నేడు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజవకర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన కెఎస్ లక్ష్మణరావు ఆదివారం మాచర్లకు రానున్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణ పెన్షనర్స్ హాల్‌లో సాయంత్రం 3 గంటలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల సభ్యులతో నిర్వహించే ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడతారని సిఐటియు జిల్లా నాయకులు బి.మహేష్ తెలిపారు. సమావేశానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, పట్టభద్ర ఓటర్లు హాజరవ్వాలని కోరారు.

ప్రజాశక్తి - అమరావతి

కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్లో ఆత్మీయ సమావేశం నిర్వహించగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి బి.నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు, ప్రజాసంఘాలన్నీ కలిసి లక్ష్మణరావు విజయం కోసం కృషి చేయాలన్నారు. ప్రజలు, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, యువత, నిరుద్యోగులు, విద్యార్థి, రైతు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించడంతోపాటు ఆయా సమస్యల పరిష్కారానికి జరిగే ఉద్యమాల్లోనూ లక్ష్మణరావుతోపాటు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పాల్గొని మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ అన్ని రంగా ప్రజల సమస్యలపై పోరాడే లక్ష్మణరావు గెలుపు అవసరమని, ప్రజాగొంతుకను చట్టసభల్లో వినిపించడానికి లక్ష్మణరావును గెలిపిద్దామని చెప్పారు. సమావేశానికి సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు అధ్యక్షత వహించగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.కోటేశ్వరరావు, డి.ప్రసాద్, పి.సూరిబాబు, వెంకటేశ్వరరాజు, ప్రజా సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

అమరావతి సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

విద్యా సంస్థల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

చిన్నారులకు బోగి పళ్లు పోస్తున్న వెంకటేశ్వర్లు, నాసరయ్య తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సంక్రాంతి సందర్భంగా పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన వేడుకలు తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య భోగిమంటలు వేసి వేడుకలు ప్రారంభించారు. గంగిరెద్దుల ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులకు బోగి పళ్ళు పోసి ఆశీర్వదించారు. కొందరు విద్యార్థులు సంక్రాంతి విశిష్టతను వివరించగా మరి కొంతమంది చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో అలరించారు. పిల్లలు గాలిపటాలు ఎగరవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ హేమంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసరావుపేట మండలం పెట్లూరువారిపాలెంలోని ఎఎం రెడ్డి స్మారక విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని తెలుగు వారు ఘనంగా జరుపుకునే పండుగను ప్రతి పల్లెలో సంస్కృతి ఉట్టిపడేలా పండుగను నిర్వహించుకోవాలన్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కోలాహలంతో పాటు స్లో సైక్లింగ్, తెలుగు అమ్మాయి మెహందీ, ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగుర వేసే పోటీలు నిర్వహించారు.పార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్. మల్లికార్జున్, డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల అకాడమిక్ డీన్ ఎ.కిషోర్‌రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

నరసరావుపేట మండలం కేసానుపల్లిలోని ఎంఎఎం గ్రూప్ ఆఫ్ కళాశాలలో వేడుకలు నిర్వహించగా కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య మాట్లాడారు. భోగి మంటలు, బొమ్మల కొలువు, రంగోలి, కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి- మాచర్ల

ముగ్గు అనేది ఇంటి వాకిలి, ఇంటి లోపలా అందంగా అలంకరించే ప్రాచీన కాలం నుండి వస్తున్న భారతీయ కళ అని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, కెసిపి యాజమాన్యం సంయుక్తంగా స్థానిక కెసిపి ఆఫీసర్స్ కాలనీలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పట్టణంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులు వేశారు. మొదటి బహుమతిగా శైలజకు భ్రమరాంబికా జువెలర్స్ కన్నెగంటి భాస్కరాచారి వెండి గిన్నెను, రెండవ బహుమతిగా ప్రశాంతికి రాధికా జ్యువెలర్స్ ఉస్తేపల్లి రాంబాబు వెండి గ్లాసును, మూడో బహుమతి సునీతకు శ్రీ డిజైనర్ బోటిక్ ప్రొప్రైటర్ గోపరపు రజిత వెండి కుంకుమ భరిణెను అందించారు. 10 కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్లు అన్నపురెడ్డి నాగార్జునరెడ్డి, లక్ష్మీ, తుమ్మల ప్రసాద్, రాధ, సమస్థితి మహిళా మండలి అధ్యక్షులు సుశీల, జాగృతి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో మాట్లాడుతున్న పొశం రామారావు

కెఎస్ గెలుపు కోసం విస్తృత సమావేశం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఉద్యోగ,ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్స్ సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు పిలుపిచ్చారు. శుక్రవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో ప్రజా సంఘాల సమావేశ పెన్షనర్స్ సంఘం మండల ఉపాధ్యక్షులు గారపాటి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ పి.డి.ఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు నిరంతరం వివిధ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, సి.పి.ఎస్.రద్దు కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ వర్గాల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మద్దతుగా అనేక ఆందోళనలు చేశారని చెప్పారు. అంగన్ వాడీ, ఆశా వర్కర్ల, మునిసిపల్ వర్కర్స్ ఇతర అనేక సంఘాలు నిర్వహించిన ఆందోళనలలో పాల్గొనడమే కాక, వారి సమస్యలను మండలిలో చర్చ పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించాలని, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరుతూ జరిగిన ఆందోళన, పోరాటాలలో లక్ష్మణరావు కూడా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో నల్లపనేని శివప్రసాద్, నూర్ భాషా సుభాని సాహెబ్, ముద్దన శ్రీనివాసరావు, పెద్దిపాగ పున్నారావు, నరిసెట్టి ఆచార్యులు, పాటిబండ్ల సాంబశివరావు, కాపు వెంకట సుబ్బారావు, ఫణిదపు భువనేశ్వరి, గుగ్గిలం సాయిబాబు, కొమ్మినేని శ్రీనివాసరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు నాయకులు పోపూరి సుధీర్, గొల్లపూడి సుబ్బారావు, తమలపాకుల ఆనందరావు, మర్రి లక్ష్మి,షేక్ షమి, కొరివి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె శిబిరాన్ని సందర్శించిన సిఐటియు నేత ఉమామహేశ్వరరావు

8వ రోజుకు క్లాప్ డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిఏంటీఎంసీ కార్యాలయం ఎదుట శుక్రవారం సమ్మె శిబిరాన్ని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను ఎన్నికల ముందు కూటమి నాయకులు వారి సమస్యలను పరిష్కరి స్తామని హామీ ఇచ్చి ఇంతవరకు పరిష్కరించలేదని అన్నారు. ఎం టీఎంసీ క్లాప్ డ్రైవర్లకు రెండు నెలల నుండి జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలను ఎలా పోషిస్తారని ప్రశ్నించారు.క్లాప్ డ్రైవర్లకు జీతాలు చెల్లించకుండా ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే, అధికారులు ఏజెన్సీ పై చర్యలు ఎందుకు చేపట్టడం లేదని అన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు టన్నుల కొద్ది చెత్తను పట్టణం నుండి బయటకు తరలిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు చెల్లించే విషయంలో అధికార యంత్రాంగం, ఏజెన్సీ సాకులు చెప్పటం సరైనది కాదని అన్నారు.జీవో ప్రకారం వారికి జీతాలు చెల్లించకుండా అరాకొర జీతాలు ఇవ్వటమే కాక, అవి కూడా ఏ నెలకనెల సక్రమంగా చెల్లించకుండా నెలల తరబడి పెండింగులు పెడుతూ, ఈఎస్ఐ కార్డులు సైతం ఇవ్వకుండా డ్రైవర్లను ఇబ్బందులు పెడుతున్న ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఎంటిఎంసి క్లాప్ డ్రైవర్ల న్యాయమైన ఆందోళనకు ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించకపోతే క్లాప్ ఆటో డ్రైవర్లకు అండగా ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, ఎం రవి, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాగొంతుకై పనిచేయడమే లక్ష్యం

తాడేపల్లిలో ప్రజాసంఘాల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ విలువలకు, సూత్రాలకు కట్టుబడి శాసన మండలిలో ప్రజా గొంతుకై పని చేయడమే లక్ష్యం అని కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రజాశక్తి భవన్‌లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గడచిన 18 సంవత్సరాలు శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై ప్రజా గొంతుకై పని చేశారన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కార్మికులు, ఉద్యోగులు, పెన్షనర్లు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, మధ్యతరగతి ప్రజలు సమస్యల పైన పాలక పక్షాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించటం చేసామన్నారు. ప్రధానంగా తాడేపల్లి పట్టణ ప్రాంతంలో గత 32 సంవత్సరాలుగా న్యాయపోరాటం చేస్తున్న కార్మికులకు అండగా శాసనమండలిలో మాట్లాడడమే కాక, సమస్య పరిష్కారం చేయాలని ఇటీవల గుంటూరు కలెక్టర్‌ను కలిసి మాట్లాడామన్నారు. సిమెంట్ కంపెనీ అక్రమ లాక్ అవుట్ అనంతరం 330 మంది కార్మికులకు గాను 170 మంది కార్మికుల చనిపోయిన పాలక పక్షాలకు చీమ కుట్టినట్లైనా లేదని ఆయన విమర్శించారు. కార్మికుల పట్ల పాలక ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని అన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో గ్రౌండ్ వాటర్ కలుషితమై కిడ్నీ వ్యాధిగ్రస్తులు 500 మంది చనిపోయారని, శాసనమండలిలో సమస్య పరిష్కారం చేయాలని, గుంటూరు ఛానల్ సమస్య పైన, రైతులు, కౌలు రైతులు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన పనిచేయడం జరిగిందన్నారు. మార్చి నెలలో జరుగు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన వాణి వినిపించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పాలక పక్షాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఓట్లు వేసి లక్ష్మణరావును గెలిపించు కోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో మార్కిస్ట్ మాసపత్రిక ఎడిటర్ ఎస్ వెంకట్రావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ అచ్యుతరావు, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, డాక్టర్ వసుంధర, ప్రజాసంఘాల జిల్లా, రాష్ట్ర నాయకులు వేముల దుర్గారావు, జొన్న శివశంకరరావు, బి సూర్యప్రకాష్, ఎం రవి, బూరుగ వెంకటేశ్వరరావు, ఏ జగన్, పోతురాజు, శంకర్, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఆర్ వి రాఘవయ్య, కొట్టే కరుణాకర రావు పాల్గొన్నారు.

పార్కులో బుద్ధుని విగ్రహాన్ని చిన్నారులతో కలసి ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నూతన హంగులతో పార్క్ ఆధునీకరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పురపాలక సంఘ పరిధిలో ఉన్న చినరావూరు పార్కులో అభివద్ధి పనులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం ప్రారంభించారు. తెనాలి పట్టణంలో చేపట్టిన ప్రత్యేక అభివద్ధి కార్యక్రమాల్లో భాగంగా రూ. 25 లక్షల వ్యయంతో చినరావూరు పార్కును సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో జంతువులు బొమ్మలతో పాటు, బోటు షికారు, వాకింగ్ ట్రాక్, చిన్నారులకు ప్రత్యేక క్రీడాప్రాంగణం, ఆరోగ్యానికి సంబంధించి వ్యాయామ పరికరాలతో ఆధునీకరించిన పార్కు ప్రత్యేక శోభ సంతరించుకుందన్నారు. ఆధునీకరించిన పార్కును ప్రజలకు అంకితమిస్తున్నామన్నారు. ఇచ్చిన గడువుకు ముందుగానే పనులను పూర్తిచేసిన అధికార యంత్రాంగాన్ని అభినందించారు. కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిపోయిన రాధిక, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, మానస రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నగరంపాలెంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యదేవిక జిల్లా ఛైర్మన్

మాట్లాడుతున్న చాంద్‌బాషా

చాంద్‌బాషా మాట్లాడుతూ 12 వేతన సవరణ కమిటీని తక్షణమే నియమించాలని కోరారు. ఇప్పటికే 18 నెలలు అయినప్పటికీ వేతన సవరణ కమిషన్‌ను నియమించకపోవడం సరికాదన్నారు. కమిటీ నివేదిక వచ్చేలోగా మధ్యంతర భతి 27శాతం ఇవ్వాలని కోరారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా ఏడు నెలలు కావస్తున్నా ఉద్యోగులకు రావలసినటువంటి ఆర్థిక ప్రయోజనాల గురించి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, నగర శాఖ కార్యదర్శి సాంబశివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మురళీకష్ణ, రహిమాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత తదితరులు ప్రసంగించారు.

సెయింట్ ఆన్స్ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో కళాశాల ఉపాధి కల్పన అధికారి డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి విద్యార్థినులకు శుక్రవారం ఎన్‌హ్యాన్స్‌మెంట్ స్కిల్ లాంగ్వేజ్ వారి సహకారంతో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఉద్యోగాల సాధనలో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 96 మంది పాల్గొనగా 28 మంది ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధి కల్పనాధికారి ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

కార్మికులకు సంక్రాంతి కానుక చెల్లింపుపై కమిషనర్‌కు సిఐటియు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు పండగ కానుక వెయ్యి రూపాయలు చెల్లించినందుకు గుంటూరు నగర కమిషనర్ పులిశ్రీనివాసులుకు ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా పథాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై గతేడాది 17 రోజులు నిర్వహించిన రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వం సంక్రాంతి పండుగకు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.వెయ్యి కానుక ఇచ్చేందుకు అంగీకరించి, జీఓ జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా జిఎంసి పరిధిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు, ఇంజినీరింగ్ కార్మికులకు వెయ్యి రూపాయలు పండుగ కానుక చెల్లించాలని పలుమార్లు అధికారులకు విన్నవించగా నగర కమిషనర్ ఆదేశాలతో అధికారులు మున్సిపల్ కార్మికుల బ్యాంక్ ఖాతాలలో శుక్రవారం నగదు జమ చేశారన్నారు. అలాగే సమ్మె కాలానికి జీతాలు కూడా చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని, ఆప్కాస్ బదిలీ పారిశుధ్య కార్మికులను రోజువారి మస్టర్ కార్మికులుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బసవపున్నయ్య

12న పేద, ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

పేద, ప్రతిభ కలిగిన ఉన్నత విద్య అభ్యశిస్తున్న విద్యార్థులకు శ్రీ కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 12న డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కె.బసవపున్నయ్య తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన మీడియా సమావేశంలో స్కాలర్‌షిప్పుల పంపిణీ వివరాలు వెల్లడించారు. దాదాపు 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు స్కాలర్‌షిప్‌లు అందచేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, బొప్పన ద్వారకాప్రసాద్, నన్నపనేని సదాశివరావు పాల్గొంటారన్నారు. 2003 నుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి సంవత్సరం దాదాపు రూ.35 లక్షల స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామని చెప్పారు. సమావేశంలో కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న సురేష్, సుబ్రహ్మణ్యం తదితరులు

అనంత ఇన్‌స్టిట్యూట్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఓ కాలనీలోని అనంత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలు, సంక్రాంతి వేషాలు, ఆటపాటలతో సంబరాలు నిర్వహించుకున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు వెల్‌కం హోటల్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ కె.సురేష్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోఆర్డినేటర్ బి.రమాదేవి హాజరై బహుమతులు అందచేశరాఉ. కార్యక్రమంలో ఛైర్మన్ ఆచార్య డి.ఎ.ఆర్.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు చేయూత

పలు గ్రామాల్లో గోకులం షెడ్లను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - నాదెండ్ల

రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, ముందుచూపుతో పనిచేస్తున్నారని.. నిత్యం ప్రజల కోసం ఆలోచించే అటువంటి వ్యక్తి రాష్ట్రానికి నాయకుడు కావడం ఆంధ్రప్రదేశ్‌కు వరమని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం నాదెండ్ల మండలం సాతులూరు, తూబాడు గ్రామాల్లో ప్రభుత్వం రూ.10 లక్షల వ్యయంతో రైతుల కోసం నిర్మించిన గోకులం షెడ్లను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సాగు చేస్తే ఆదాయం పెరుగుతుందన్నారు. భూమినే నమ్ముకోకుండా.. గేదెలు, మేకలు, కోళ్ల పెంపకం లాంటివి చేపట్టాలని, వాటికోసం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి, జనసేన కన్వీనర్ తోట రాజారమేష్, నియోజకవర్గ సమన్వయకర్త సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు : పాడి పరిశ్రమకు మరింత చేయూతనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి, పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అర్తిమల్ల రమేష్ అన్నారు. మండలంలో నిర్మించిన 15 గోకులం షెడ్లను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. త్వరలో గ్రామపంచాయతీకి రెండు చొప్పున 40 యూనిట్లు మంజూరు కానున్నట్లు తెలిపారు.

గోకులం షెడ్లు ప్రారంభం

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో గోకులం షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో కోటమ్మ సుశీల, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ : చీఫ్‌విప్ జీవీ

వినుకొండ : సీఎం చంద్రబాబు నాయకత్వంలో 2047 నాటికి అభివృద్ధిలో రాష్ట్రం దేశానికి ఆదర్శ నమూనాగా నిలుస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. పల్లె పండగలో భాగంగా ఈపూరు మండలం కొండ్రముట్లలో గోకులం షెడ్డును మాజీ ఎమ్మెల్యే మక్కెనతో కలిసి ఆయన ప్రారంభించారు. వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషకులకు చేయూత అందించేందుకు, పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి ప్రభుత్వం మినీ గోకులాలను ప్రారంభించిందన్నారు.

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో లబ్దిదారుడు సన్నెబోయిన వెంకటసుబ్బయ్య ఉపాధి హామీ నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం (పశువుల) షెడ్డును ఎమ్మెల్యే జీవీ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి, వెటర్నరీ ఏడీఏ శ్రీనివాసమూర్తి, పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులే ధ్యేయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

గుంతలు లేని రహదారులే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. పెదకూరపాడు అంబేద్కర్ బొమ్మ సెంటర్ నుంచి పాల కేంద్రం వరకు రెండు వరుసలతో 8 మీటర్ల మేర రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారి ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను శుక్రవారం డీఈ వాణీనాథ్, ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. సొంత గ్రామాలకు సంక్రాంతి పండగకు వచ్చే వారికి కొత్త రోడ్లతో స్వాగతం పలికేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ నెలాఖరుకు అంబేద్కర్ బొమ్మ సెంటర్ నుంచి పాలకేంద్రం వరకు చేపడుతున్న రహదారిని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వైకుంఠ ఏకాదశి వేడుకలు విజయపురిసౌత్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సీతారామాలయంలో అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులకు స్వామి వారి ఉత్తరద్వార దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో పారిశుధ్య కార్మికుల సేవలు కీలకం

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజా ఆరోగ్య రక్షణలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు కీలకమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు సమర్థవంతంగా పని చేసి క్లీన్ మాచర్ల కోసం పాలకవర్గానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్ల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో రహదారిపై గుంతల పూడ్చివేత

ప్రజాశక్తి - విజయపురిసౌత్

జనసేన పార్టీ ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లోని మెయిన్ బజార్ వద్ద రహదారిపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ మార్గమంతా గోతులమయమై ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుంతలు పూడ్చేందుకు జనసైనికులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాచర్ల జనసేన అధ్యక్షుడు సాంబశివరావు, విజయపురిసౌత్ జనసేన అధ్యక్షుడు రాహుల్, పండు, చరణ్, షేక్ మస్తాన్, బన్ను, రమేష్, ఆడెపు సత్యనారాయణ, గోవిందు, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే బుద్ధి చెబుతాం..

ప్రజాశక్తి - నాదెండ్ల

తమ దైవం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే తగిన బుద్ధి చెబుతామని నాదెండ్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ కాలనీ పెద్దలు హెచ్చరించారు. బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నాదెండ్ల గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, శుద్ధి చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ, షేక్ బాజీ, కోవూరి శ్రీధర్, షేక్ నసీరుద్దీన్, జాస్తి నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు ఖండన

సత్తెనపల్లి రూరల్ : పార్లమెంటులో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఏఐసీసీ, పీసీసీ పిలుపుమేరకు సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త చుక్కా చంద్రపాల్ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కంకణాలపల్లి సర్పంచ్ చెరుకూరి వన్నూర్ కు వినతి పత్రం అందజేశారు. అమిత్ షా రాజీనామా తీర్మానాన్ని గ్రామ పాలకవర్గ సమావేశంలో ప్రవేశ పెట్టాలని కోరారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజ్ పాల్, పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, నాయకులు బొక్క చిన్న గురు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళనలు

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శుక్రవారం వినుకొండ పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పలువురు సమర్పించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

అమరావతిలో నిరసన

అమరావతి : సిపిఐ ఆధ్వర్యంలో నిరుపేద కూలీలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో అర్జీలతో పాటు వినతి పత్రాన్ని అమరావతి తహసీల్దారు నాగమల్లేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భైరాపట్నం రామకృష్ణ, మునగోటి శ్రీనివాసరావు, శరణం విజయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇల్లు లేని అర్హత కలిగిన నిరుపేదలకు నివాస యోగ్యమైన స్థలాలతో పాటు గృహ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు.

మాచర్ల : సిపిఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని ధర్నా చేపట్టారు. తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, మంజుల లక్ష్మయ్య, ఆలేటి జార్జి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

ఆలయాల్లో ఏకాదసి వేడుకలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ :

మాచర్ల పట్టణంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రసిద్ధ మాచర్ల చెన్నకేశవాలయానికి భక్తులు పోటెత్తారు. పట్టణంలోని వైష్ణవాలయాలైన చెన్నకేశవాలయం, రామాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాలకు భారీగా తరలివచ్చారు. ఆయా దేవాలయాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, దేవస్థానం సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణం, గ్రామాలలో ఉన్న ఇళ్ల స్థలాలు, భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టి సారించాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను దళిత సంఘాల నాయకులు కోరారు. మాచర్ల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శుక్రవారం దళిత, ప్రజా సంఘాల నాయకులు కలసి సత్కరించారు. ఈ సందర్భంగా దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంటి స్థలాలు, పొలాలు ఇప్పిస్తామని కొందరు పేద ప్రజలను మోసం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు గురజాల అప్పారావు, కందుల రవికుమార్, కడియం అన్నారావు, కుక్కమూడి యాకోబు, పశువేముల గ్రామసర్పంచ్ కర్రా చిన రంగయ్య తదితరులు పాల్గొన్నారు. తహసీల్దారు కిరణ్‌కుమార్‌ను టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెరా దుర్గారావు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి, ప్రజా సమస్యలు పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు.

మాచర్లలో కోతుల బెడద నివారణకు చర్యలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

పట్టణంలో కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు శుక్రవారం తెలిపారు. కోతుల వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమకు పలు ఫిర్యాదులు అందాయన్నారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా కోతుల పట్టేవారిని పిలిపించి పట్టణంలో పలు చోట్ల బోనులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వానరాలను పట్టుకున్నామన్నారు. వీటిని శ్రీశైలం - దోర్నల అడవుల్లో వదిలిపెడతామని తెలిపారు.

ప్రజాశక్తి
7
గుంటూరు జిల్లా
శనివారం 11 జనవరి 2025

సమ్మె కాలపు ఒప్పందాల అమలేదీ?

ప్రజాశక్తి-మంగళగిరి

గత సమ్మె కాలపు ఒప్పందాల జీవోలను ఇప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమని సిఐటియు జిల్లా నాయకులు ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, బి.వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎంటీఎంసీ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే గత సమ్మె కాలపు ఒప్పందాల జీవోలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపుదల చేసేలా జీవో నంబరు 36ను అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలన్నారు. ఆప్కాస్‌లోకి తీసుకున్న కార్మికులకు గత మార్చి నుంచి ఆగస్టు నెల వరకు పెండింగ్ ఉన్న రూ.5 వేలు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు, యూనిఫారం ఇవ్వాలన్నారు. అనంతరం అదనపు కమిషనర్ కె.శకుంతలదేవికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు కె.వెంగమ్మ, ఆర్.వేణు, డి.రామారావు, శివ, రవి, నారాయణ పాల్గొన్నారు.

ఏసిసి కార్మికుల పోరాటాన్ని ఉధృతం చేస్తాం..

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఏసీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని.. ఈ నేపథ్యంలో కార్మికుల న్యాయ పోరాటాన్ని ఉధృతం చేయనున్నామని పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్, ఏఐఎఫ్టీయూ నాయకులు ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏసీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి వారు మాట్లాడారు. కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, చట్ట ప్రకారం తమకు రావలసిన నష్టపరిహారం కోసం మాత్రమే న్యాయపోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యపై జోక్యం చేసుకొని, నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో రమాదేవి, శారమ్మ, ఎస్కే ఇమాంబి, టి.దుర్గా భవాని, శివకుమారి కూర్చొన్నారు.

రంగోలి.. ఆరోగ్య ఫలి

ప్రజాశక్తి-దుగ్గిరాల

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు వినూత్న రీతిలో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల ద్వారా ఆరోగ్యపరమైన అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని వైద్యాధికారి అబ్దుల్ ఎజాజ్ రెహ్మాన్ తెలిపారు. వివిధ రకాల అసంక్రమిత వ్యాధులు, మధుమేహం, బీపీ, కేన్సర్, కుష్ఠు, కరోనా, హెచ్ఎంపీవీ వైరస్ తదితర వాటిని వివరిస్తూ.. పలువురు ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అన్నారు. సంక్రాంతి సందర్భంగా యర్రబాలెం డాన్ బాస్కో ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులు తెలుసు కోవాలన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, హెచ్ఎం ఫాతిమా రాణి, ఫాదర్ జోష్ పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండగ నిర్వహించారు ఈ సందర్భంగా గోకులం షెడ్లను ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పశు పోషణదారులు, రైతాంగాన్ని ఆదుకోవడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తలనంతరం తహశీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు.

ఆలయాలకు సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు. తెనాలి వైకుంఠపురంలో శ్రీ లక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాటలను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులతో పోటెత్తిన వైకుంఠపురం దేవాలయం.. గోవింద నామస్మరణతో మార్మోగింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం హరిబాబు, ప్రధాన అర్చకులు, సిబ్బంది మంత్రి మనోహర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినం భక్తుల జీవితాల్లో విశేషమైన శుభాన్ని తీసుకురావడమే కాక, దేవాలయ దర్శనం ఎంతో పుణ్యఫలప్రదమని చెప్పారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవం

మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, ఉత్తర ద్వార దక్షిణం ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు స్వామివారిని దర్శించుకుని శంకు తీర్థం పుచ్చుకున్నారు. అలాగే అధిక సంఖ్యలో భక్తులు హాజరై శంకు తీర్థాన్ని స్వీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

శంఖుతీర్థం స్వీకరిస్తున్న డీజీపీ

క్యూలైన్లో టెంట్లు వేసి మంచినీరు, పాలు వంటి మౌలిక సదుపాయాలను ఆలయ అధికారులు కల్పించారు. శనివారం కూడా భక్తులకు శంఖు తీర్థం అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సేవలో మేము సైతం...

మంగళగిరి : మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం, శంఖు తీర్థానికి వచ్చే భక్తులకు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.అనూష వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రసాదాల పంపిణీ..

భగీరథ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. ఏటా ముక్కోటి ఉత్సవాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివసత్యనారాయణ, కగ్గా శ్రీనివాసరావు, రాజారావు, నాగరాజు, అచ్చయ్య, నంద్యాల గోపాలకష్ణ, వీర రాఘవ, శివన్నారాయణ, మారం మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దర్శనం చేసుకుంటున్న మంత్రి మనోహర్

భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ

ఉచిత వైద్యశిబిరం

వైభవంగా మల్లేశ్వరుని బ్రహ్మోత్సవం

పెదకాకాని : పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం పూల అలంకణ చేసిన వాహనంపై స్వామివార్లను ఊరేగించారు.

'కూటమి నాయకులతో ఇబ్బందులు పడుతున్నాం'

ప్రజాశక్తి-తాడికొండ

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమకు ఇబ్బందులు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బాల వజ్రబాబు ఎదుట లాం గ్రామ వైసీపీ నాయకులు ఆవేదన వ్యకతం చేశారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వజ్రబాబుకు.. పలువురు తమ సమస్యలు విన్నవించుకున్నారు. వైసీపీ నాయకులే లక్ష్యంగా ఇళ్లను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమంగా గ్రావెల్ తవ్వి 300 మంది సభ్యులు ఉన్న క్వారీ కార్మికులకు ఉపాధి లేకుండా పొట్ట కొడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు ఫిర్యాదులు చేసి ఇళ్లను కూలగొడతామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు.

అసైన్డ్ రైతులకు కౌలు చెల్లింపులో జాప్యం తగదు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత అసైన్డ్ రైతులకు కౌలు చెల్లింపులో జాప్యం తగదని అమరావతి దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య అన్నారు. తక్షణమే కౌలు చెల్లించాలని ప్రభుతాన్ని కోరారు. రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలోని దళిత బహుజన జెఎసి కార్యాలయంలో శుక్రవారం అసైన్డ్ రైతులకు హెల్ప్ డెస్క్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవయ్య మాట్లాడుతూ వ్యవసాయ పనులు, ఉపాధి అవకాశాలు లేక అసైన్డ్ రైతుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి గతంలో సిఆర్‌డిఏ అధికారులు 9.14 అగ్రిమెంట్ ద్వారా ఎవరికైతే కౌలు జమ చేశారో వారికి వెంటనే కౌలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

కొమ్మినేని వీరయ్య చౌదరికి నివాళులు

తుళ్లూరు : కొమ్మినేని వీరయ్య చౌదరి చిరస్మరణీయులని పలువురు నివాళులు అర్పించారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయం సెంటర్లో వీరయ్య చౌదరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజాశక్తి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక లయన్స్ మాంటిస్సోరి హైస్కూల్ సిబిఎస్ఈ పాఠశాలలో శుక్రవారం మండల తహసీల్దార్ పి.శంకర్ బాబు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల సమస్యల మీద నిరంతరం వార్తలు ప్రచురిస్తోందని తెలిపారు. దినపత్రికలలో ప్రజాశక్తిది ప్రత్యేక స్థానమని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ముద్దన నాగరాజకుమారి, టిడిపి సీనియర్ నాయకులు కొల్లా రత్తయ్య, మండల విద్యాశాఖ అధికారి ముద్దన శ్రీనివాసరావు, పాఠశాల గౌరవ అధ్యక్షులు దాసరి శేషగిరిరావు, కమిటీ సభ్యులు ముద్దన రాఘవయ్య, అరవపల్లి కష్ణమూర్తి, అన్నపర్రు మాజీ సర్పంచ్ కొల్లా ఉమామహేశ్వరి, తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు, ప్రజాశక్తి విలేకరి కొత్త వెంకటశివరావు, రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి పత్రికతో తమ అనుబంధాన్ని వివరించారు.

జాతీయ సదస్సు బ్రోచర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సామాజిక ఆర్థిక, పర్యావరణ ప్రగతికి అనుసరించాల్సిన వ్యూహాలపై జాతీయ స్థాయి సదస్సును వచ్చే నెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు తెలిపారు. సదస్సు బ్రోచర్లను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ వారి జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర అభివృద్ధికి అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సదస్సు చర్చించి ఫలప్రదమైన తీర్మానాలు చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆచార్య రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్టేజ్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి ఆటోనగర్ వద్ద ప్రెస్టేజ్ షోరూంను సంస్థ బ్రాంచ్ మేనేజర్ డి.అరుణ్ కుమార్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సరసమైన ధరలకే ప్రెస్టేజ్ షోరూంలో బ్రాండెడ్ వస్తువులు లభ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాజు, విశ్వనాథ్, డిఫినిటీ ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ చల్ల అనంతవల్లి, బాలసుబ్రహ్మణ్య సాయిరాం, వెంకట సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-తాడికొండ

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్ రావు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉప తహసీల్దార్ నిర్మలకృష్ణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు.

రూ.1200 కోట్లతో పల్నాడుకు వాటర్‌గ్రిడ్ పథకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్న వాటర్ గ్రిడ్ పథకం అమలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులతో నిర్మించే ఈ ప్రాజెక్టుకు రూ.1200 కోట్లతో ఆన్ లైన్ విధానం (ఈ - ప్రొక్యూర్మెంట్) లో టెండర్లకు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 10 వ తారీకు నుండి 24 వ తారీకు మధ్యాహ్నం 3 గంటల లోపు ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించారు. ఈ ప్రాజెక్టులో నాగార్జున సాగర్ నుండి నీటిని సేకరించి దగ్గరలో శుద్ధ జల కేంద్రాన్ని నిర్మించి నీటిని ఫిల్టర్ చేస్తారు. పైప్ లైన్‌ల నిర్మాణం ద్వారా ఈ నీటిని గ్రామాలకు, పట్టణాలకు తరలించి ఓవర్ హెడ్ ట్యాంక్‌ల్లో నింపుతారు. ఈ నీటిని ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నుండి ప్రతీ ఇంటికీ సరఫరా చేస్తారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్, అమృత దార ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి ఏర్పాటు ద్వారా నీటిని ప్రతి ఇంటికి అందించే లక్ష్యంతో ఉన్నప్పటికీ.. బోర్లు వేసినా నీరు పడక కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టు అంతగా ముందుకు సాగటం లేదు. కానీ వాటర్ గ్రిడ్ పథకం ద్వారా పరిపూర్ణంగా నీటిని అందజేయవచ్చు, అలాగే ఫ్లోరైడ్ సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుంది. దీని నిర్మాణం కోసం 2019 నుంచి టిడిపి ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు తీవ్రంగా కృషి చేస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు వద్ద ఈ జల ప్రాజెక్టు గురించి విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు పథకం నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో మరో ముందడుగు పడి టెండర్లు ఆహ్వానించడంపై ఎంపి లావు శ్రీకృష్ణదేవరనాయులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి సంబంధిత అధికారులకు లావు శ్రీకృష్ణ దేవరాయలు ధన్యవాదాలు తెలియజేశారు.

రూ.6.60 కోట్లతో జిటిఎస్ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణకు జి.టి.యస్ (గార్బేజ్ ట్రాన్సఫర్ సిస్టం)లు ఉపయోగపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఏటుకూరు రోడ్డులోని నగర పాలకసంస్థ కంపోస్ట్ యూనిట్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి రూ.6.60 కోట్లతో నిర్మించనున్న జి.టి.యస్ పనులకు శంకుస్థాపన చేశారు. కమిషనర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం గుంటూరు నగరానికి 4 జి.టి.యస్‌లను మంజూరు చేయగా, గతంలో వాటి నిర్మాణ పనులు జరగలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే గల్లా మాధవి చొరవతో జిల్లాలో మొదటి జి.టి.యస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. దీని వల్ల తడి పొడి చెత్తలను వేరు చేయడంతో పాటు, తడి చెత్తతో బయోగ్యాస్, వర్మి కంపోస్ట్ తయారు చేస్తారని, పొడి చెత్తను జిందాల్‌కు తరలించటం జరుగుతుందన్నారు. జి.టి.యస్‌కు రోజుకు 120 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉందన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, నగరంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చెత్త సమస్యకు పరిష్కారంగా పశ్చిమ నియోజకవర్గంలో జి.టి.యస్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 4 నెలల్లో నిర్మాణ పనులు పూర్తిచేస్తామన్నారని తెలిపారు. కార్యక్రమంలో యస్.ఈ నాగామల్లేశ్వరరావు, సి.యం.హెచ్.ఓ డాక్టర్ పి.జె.అమత, ఈ.ఈ సుందర రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - పెదకాకాని

డాక్టర్ నూతలపాటి అశోక్‌ను అభినందిస్తున్న విద్యాసాగర్ తదితరులు

మండల పరిధి నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి (వివిఐటి) కళాశాల ఐటి ఇంజనీరింగ్ విభాగానికి చెందిన నూతలపాటి అశోక్‌కు డాక్టరేట్ లభించిందని వివిఐటి ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆయన మాట్లాడుతు 'కంటి రెటీనా సంభందిత వ్యాధుల' పై చేసిన పరిశోధనలకుగాను ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నూతలపాటి అశోక్ పరిశోధన ప్రొఫెసర్ డాక్టర్ కె.గంగాధరరావు పర్యవేక్షణలో చేశారని తెలిపారు. అనంతరం నూతలపాటి అశోక్‌ను ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, డీన్ డాక్టర్ కె. గిరిబాబు, ఐటి విభాగాధిపతి డాక్టర్ ఆళ్ల కళావతి అభినందించారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో సిస్కో థింగ్‌క్యూబేటర్ ఇన్నోవేషన్ మేళా

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులను అభినందిస్తున్న సహన్‌రాజ్, తదితరులు

వడ్లమూడి విజ్ఞాన్ యూని వర్సిటీలో సిస్కో థింగ్‌క్యూబేటర్ ఇన్నోవేషన్ మేళా శుక్రవారం నిర్వహించారు. వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్, ఈ-సెల్, నాస్కామ్ సంయుక్త ఆధ్వర్యంలో సిస్కో ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. నాస్కామ్ ఫౌండేషన్ ఇన్నోవేషన్ మేనేజర్ సహన్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆవిష్కరణల సామర్థ్యాన్ని పెంపొందించడానికి, వ్యాపారాత్మక ఉత్సాహాన్ని కలిగించడానికి ఈ మేళా ఒక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. యువతలో నూతన ఆవిష్కరణలను పెంపొంపొందించటమే తమ లక్ష్యమన్నారు.విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాపులు, ఆవిష్కరణలు, వ్యాపారవినియోగం, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిపై కృషి చేస్తామన్నారు. అనుభవజ్ఞుల నుండి ప్రేరణాత్మక సెషన్లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. యువఆవిష్కర్తల ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించడానికి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఇన్నోవేషన్ మేనేజర్ అల్బర్ట్ డైలన్ మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలకు మెంటారింగ్, పరిశ్రమ నిపుణులతో నెట్‌వర్కింగ్ అవకాశాలను కల్పిస్తామన్నారు. అనంతరం ఐడియథాన్ పోటీ నిర్వహించారు. విద్యార్థుల నుంచి వచ్చిన 256 ఐడియాలలో అత్యుత్తమమైన 10 ఆవిష్కరణల పరిష్కారాలను తుది పోటీకి అర్హత సాధించారని వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతి అందచేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ గీతేష్, విభాగాల డీన్లు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి

బి.హెచ్ కాలేజీలో ..

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కాలేజిలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, నెహ్రూ యువకేంద్రం అధికారి కిరణ్మయి, స్టెప్ మేనేజర్ రాధిక హాజరై సంక్రాంతి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ బి.విజయభాస్కర్, కార్యదర్శి శ్రీధర్, కౌశల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాధామాధవి తదితరులు ప్రసంగించారు.

అభ్యుదయ మహిళా కాలేజీలో..

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కాలేజిలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు భోగిమంటలు, మత్యాల ముగ్గులు, సాంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి లక్ష్మి, మెహంది పోటీలు నిర్వహించారు. విద్యార్థినులకు ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు బిఎస్ఆర్‌కె ప్రసాద్, రోహిణీదేవి పాల్గొని అభినందించారు.

కెఎల్‌పి స్కూల్లో..

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగవల్లులు, పచ్చని తోరణాలు, పూరిళ్ల, గాలిపటాలతో అలంకరించారు. సంక్రాంతి విశిష్టతను పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ వివరించారు. డ్యాడ్రాప్స్ చిన్నారులకు భోగిపళ్ళ వేడుకను, భోగిమంటల కార్యక్రమాన్ని, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏఒ వెంకట్రావు పాల్గొన్నారు.

శ్రీవిద్య హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక సంతోష్ నగర్‌లోని శ్రీవిద్య హైస్కూల్ శుక్రవారం పాఠశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి అంటే తెలుగువారి పండగని, పిండి వంటలతో కుటుంబ సమేతంగా ఆనందంగా ఈ పండుగను చేసుకుంటారని, హరిదాసు గీతాలు, భోగి మంటలు, గొబ్బెమ్మలు, చిన్నారులకు భోగి పళ్ళు వేసి ఆశీర్వదించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గులు, భోగిమంటల కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కళ్లం కాలేజీలో ముగ్గుల పోటీలు

కళ్ళం ఇంజినీరింగ్ కాలేజిలో ముందుస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు వందమందికిపైగా విద్యార్థినీలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ముగ్గులను వేశారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఎస్.బి.రెడ్డి తెలిపారు. పోటీల్లో జె.రోజా, బి.ప్రశాంతి మొదటి బహుమతి, ఎ.విజయదుర్గా, జి.జ్యోత్స్న ద్వితీయ బహుమతి, టి.రేణుక, సిహెచ్ జగతి తృతీయ బహు మతి గెలుపొందారని పోటీ నిర్వాహకురాలు డాక్టర్ కె.లక్ష్మి తెలిపారు.

ఎసిఎంఇ స్కూల్లో కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు : పొత్తూరులోని ఎసిఎంఇ స్కూల్లో శుక్రవారం కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నృత్యాలు, సంప్రదాయ, వెస్ట్రన్ డ్యాన్సులు ' ప్లే ది మర్చంట్ ఆఫ్‌ది వెనిస్' అనే షేక్స్పియర్ నాటికను ప్రదర్శించారు. అనంతరం కైట్ ఫెస్టివల్‌లో పాల్గొని రకరకాల గాలిపటాలు ఎగురవేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నందమూరి సౌగంద్‌కృష్ణ, దీప్తి పాల్గొని బహుమతులు అందచేశారు.

గుంటూరు కళాపరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నాటకోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ప్రారంభసభకు అధ్యక్షత వహించిన కళాపరిషత్ అధ్యక్షులు పి.వి. మల్లిఖార్జునరావు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా నాటకాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఏటా సమయ పాలన పాటిస్తూ నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ వైద్యులు యెండ్లూరి సీతారామాంజనేయులు మాట్లాడుతూ వాస్తవికమైన కథాంశాలతో సాగుతున్న నాటకరంగాన్ని ప్రేక్షకులు బాగా ప్రోత్సహించాలన్నారు. సభలో రంగస్థల నటులు, దర్శకులు వేముల మోహనరావు, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ ప్రసంగించారు. తర్వాత మొదటగా స్వేచ్ఛకు హద్దే ముద్దుగా ఉంటుందని, అలా కాకుండా మితిమీరిన స్వేచ్ఛతో జీవిస్తే జీవితం తెగిన గాలిపటంలా మారుతుందని తెలియజేస్తూ ' స్వేచ్ఛ' నాటకాన్ని ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన ఈ నాటికకు పిఎస్ నారాయణ మూలకథ సమకూర్చగా, పి.శివరామ్ నాటకీకరణ చేశారు. బిఎం.రెడ్డి దర్శకత్వం వహించారు. తర్వాత రైల్వే వారు జనరల్ బోగీలు పెంచటంతోపాటు, ప్రయాణికుల వివరాలు తీసుకొని గుర్తింపు ఇవ్వాలని శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారు 'జనరల్ బోగీలు' నాటికప్రదర్శించారు. ఈ నాటికను పి.టి.మాదవ్ రచించగా, జి.విజయ్ దర్శకత్వం వహించారు. చివరిగా బందాల విలువను తెలియజేస్తూ 'రుతువు లేని కాలం' నాటిక ప్రదర్శించారు. ఈ నాటికను అగస్త్య రచించగా, వై.బుచ్చయ్యచౌదరి దర్శకత్వం వహించారు.

నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

స్వేచ్ఛ నాటికలోని ఒక సన్నివేశం